# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 14 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## అవసరమైతే తప్పా.. బయటకు రాకండి

### హైడ్రా కమిషనర్ కీలక సూచన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక సూచన చేశారు. భారీ వర్షాలు నేపథ్యంలో అవసరమైతే తప్పా.. బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. భారీ వర్షాలు కురవనున్నాయంటూ వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. ఎంతటి విపత్తు ఎదురైనా, వాటిని ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని ఆయన వివరించారు. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు వస్తే, ప్రజలను రక్షించేందుకు బోట్స్‌తో సహా అన్నింటిని సిద్ధం చేశామని చెప్పారు. నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తుందని ఆయన తెలిపారు. మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ఇప్పటికే సిబ్బంది ఉన్నారన్నారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే సహాయక చర్యల్లో పాల్గొనాలని యువతకి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

# వానలే వానలు.. రెడ్ అలర్ట్



- జలమయమైన రైల్వే అండర్ బ్రిడ్జిలు
- మరోసారి ఖమ్మం నగరం జలమయం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ ప్రకటించింది. అధికారులు అప్రమత్తమై ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించారు. మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసాయి. వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు, కాల్వర్టులు కోతకు గురయ్యాయి. గిరిజన ప్రాంతాల్లో వాగులు అలుగు పోస్తుండటంతో రవాణా స్తంభించింది.మంగళవారం భారీగా కురిసిన వర్షాలనేపథ్యంలో వరంగల్ నగరంలో ముంపు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 16 వరకు భారీ వర్ష సూచనలు ఉండటంతో బల్దియా అధికారులు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. వరంగల్ నగర పరిధి చింతల్ మైసమ్మ గుడి వద్ద డ్రైన్ వాటర్ పనులను బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి పరిశీలించారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన వారికి మంచి నీరు, ఆహారం అందజేస్తున్నారు. 30కి పైగా కాలనీల్లో సుమారు వెయ్యి కుటుంబాలు ముంపు తీవ్రతను ఎదుర్కొన్నాయి. జయశంకర్ -భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని పలు వార్డుల్లోకి వరదనీరు చేరి రోగులు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. వైద్యరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వర్షపు నీరు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపురం మండలం ధర్మరావుపేట, గణపురం, వెళ్తుర్లపల్లి, అప్పయ్యపల్లి గ్రామాల మధ్య ఉన్న మోరంచ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పంట పొలాలు మొత్తం నీట మునిగాయి. రైతులు నాలుగు రోజుల క్రితం వేసిన వరి నాట్లు నీట మునిగిందని లబోదిబోమంటున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలతో పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. కుమురం భీం–ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని ఏకైక జలాశయం పాల్వాయి పురుషోత్తం రావు పూర్తిగా నీటితో నిండిపోయి ఎర్రవాగు, నల్లవాగు, మత్తడిలు పొంగి పొర్లుతున్నాయి. దిగువ ప్రాంతంలో ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గిరవెల్లి, గెర్రే, కొంచవెల్లి, పీకాలగుండం గ్రామాల్లో పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయి. బెల్లంపల్లి నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరద నీటి ఉధృతికి కల్వర్టులు, రోడ్లు కోతకు గురయ్యాయి. కాసిపేట నుంచి గోపాల్‌నగర్ వెళ్లే రహదారిపై వంతెన వరద తాకిడికి ధ్వంసమైంది. భారీ వర్షాలకు మండలంలో 89 ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ అధికారి సుష్మ తెలిపారు.

**లోతట్టు ప్రాంతాలు జలమయం**

ఖమ్మం నగరం మరోసారి జలమయమయింది. డ్రయినేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఖమ్మం పాత బస్టాండ్ సెంటర్ నుంచి బాబూరావు పెట్రోల్ బంకు వరకు చెరువును తలపించే విధంగా నీరు నిలిచింది. డ్రయినేజీ నీరు రోడ్డు మీద ప్రహిస్తుండటంతో వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఆకేరు, మున్నేరు వాగులు ఉధృతంగా

మిగితా 2వ పేజీలో



## పెండ్లికొడుకును భుజాలపై మోసుకుంటూ...

కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రం ఊర చెరువు మత్తడి వాగు ప్రవాహం ఎక్కువ కావడంతో పెండ్లి కొడుకు తీవ్ర ఇబ్బంది పడ్డాడు. పెండ్లి కోసం మండల కేంద్రానికి చేరుకోవాల్సిన పెండ్లికొడుకు ప్రయాణిస్తున్న వాహనం వరద ఉధృతి కారణంగా నిలిచిపోయింది. దాంతో చేసేదేమీ లేక బంధువులు పెండ్లికొడుకును భుజాలపై మోసుకుంటూ అవతలి ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి మరో వాహనంలో మండపానికి తీసుకెళ్లారు. లోలెవెల్ కల్వర్టు కారణంగా మండల ప్రజలు ఏటా ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతి పెరిగినప్పుడు బస్సు సేవలు కూడా నిలిచిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



## భూధార్ నెంబర్లకు ప్రణాళికలు

- మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. అలాగే, రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ముఖ్యమంత్రి గారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారితో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. లైసెన్డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాయాలు పూర్తిగా ప్రజలకు స్నేహ పూర్వక వాతావరణంలో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు వివరించగా, ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని తలెత్తిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## ఎమ్మెల్సీల నియామకాలపై సుప్రీంకోర్టు స్టే



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కోదండరామ్, అమీర్ ఆలీఖాన్‌ల ఎమ్మెల్సీ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వీరి ప్రమాణ స్వీకారాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించిన కోర్టు, తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపికలు జరగాలని స్పష్టం చేసింది.

**పిటిషనర్ల వాదనలు**

బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఈ నియామకాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వీరి పేర్లను ప్రతిపాదించగా అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం 2024 జనవరి 13న కోదండరామ్, అమీర్ ఆలీఖాన్ పేర్లను పంపగా, గవర్నర్ ఆమోదం తెలిపారు. హైకోర్టు ఈ నియామకాలను రద్దు చేసినప్పటికీ, మళ్లీ వీరి పేర్లను ఆమోదించి ప్రమాణ స్వీకారం చేయించారు.

**కేటీఆర్ స్పందన**

సుప్రీంకోర్టు తీర్పు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టినట్టేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. గవర్నర్ వ్యవస్థను బీజేపీ దుర్వినియోగం చేసిందని, కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని గౌరవించని ఈ రెండు జాతీయ పార్టీల నిజస్వరూపం బట్టబయలైందని కేటీఆర్ విమర్శించారు.

## భట్టి విక్రమార్కకు కేటీఆర్ సవాల్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు అన్ని గ్యారంటీలు అమలు చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే ఇదే మాట తెలంగాణలోని ఏదైనా గ్రామంలో ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. "ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ చేస్తున్న మోసం, ప్రాపగండా చూసి గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను తన్ని తరుముతున్నారు. భట్టి విక్రమార్క గారు, మీ మంత్రులతో కలిసి ఏదైనా ఒక గ్రామానికి వెళ్లి ఆరు గ్యారంటీలు అమలు చేశామని చెప్పండి. ఆ గ్రామం నుంచి మిమ్మల్ని తరిమి వేయకపోతే నేను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటాను" అని కేటీఆర్ సవాలు చేశారు.



గ్యారంటీ కార్డులు దాచుకోవాలని, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు అయినా ఒక్క గ్యారంటీ సరిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ మోసాన్ని తెలుసుకున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**వర్షబాధితులకు అండగా నిలవాలని పిలుపు**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల అనేక ప్రాంతాలు జలమయమై, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి, త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస సహాయాన్ని అందించాలన్నారు. అత్యవసర వైద్య అవసరాల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని కూడా కేటీఆర్ పిలుపునిచ్చారు.

## నేడు మూడు జిల్లాల్లో స్కూళ్లకు సెలవు

- విద్యాశాఖ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధ, గురువారాల్లో హాఫ్ డే తరగతులు నిర్వహించా లని ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విద్యార్థులకు సెలవు ఇవ్వాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని పాఠశా లలకు గురువారం పూర్తిగా సెలవు ఇవ్వాలని ప్రభుత్వం



## కంచ గచ్చిబౌలి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల అభివృద్ధి వివాదంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక సూచనలు చేసింది. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణను నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధి పనులు కొనసాగించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి అధ్యక్షతన విచారణ జరగగా, "మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ పర్యావరణాన్ని కాపాడే చర్యలు తప్పనిసరి" అని వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణపై సరైన చర్యలు తీసుకుంటే అన్ని ఫిర్యాదులను ఉపసంహరించుకోవచ్చుని, అప్పుడు ప్రభుత్వాన్ని అభినందిస్తామని పేర్కొన్నారు.

సుప్రీం సూచనల ప్రకారం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి ఆరు వారాల సమయం కావాలని సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ ప్రభుత్వ తరఫున అభ్యర్థించారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలో ఐటీ పార్క్ అభివృద్ధి కోసం చెట్లను నరికివేయడం, వన్యప్రాణులను తరలించడం వంటి చర్యలకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. ఇంతకుముందు కోర్టు 100 ఎకరాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించగా, ఆదేశాలు లెక్కచేయకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా అధికారులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించింది. పునరుద్ధరణ ప్రణాళికను సమర్పించాలనే ఆదేశాలు కూడా జారీ చేసింది.

## భారత్, పాక్ దళాల మధ్య కాల్పులు

- చొరబాటు యత్నం భగ్నం
- ఒక సైనికుడు మృతి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

జమ్ముకాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో ఉరి వద్ద నియంత్రణ రేఖ సమీపంలో ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వ్యక్తులు దేశంలోకి చొరబాటుకు చేసిన యత్నాన్ని భారత్ సైన్యం తిప్పికొట్టింది. అయితే ఈ ప్రయత్నంలో ఒక భారత సైనికుడు మృతి చెందాడు. మృతి చెందిన సైనికుడ్ని చినార్ క్రాప్స్‌కు చెందిన హవిల్దర్ అంకిత్ కుమార్‌గా గుర్తించారు. బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. కొందరు పాకిస్తానీ చొరబాటుదారులు భారత్‌లోకి ప్రవేశించడానికి యత్నించారు. భారత సైన్యం వారిని అడ్డుకుంటుండగా.. చొరబాటుదారులు కాల్పులు జరిపారు. చొరబాటుదారులు పారి పోయినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. కాగా, ఇదే ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం కాల్చిచంపింది.

## గోల్కొండ కోటలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రస్థాయిలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆగస్టు 15న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, రాణి మహల్ వద్ద నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ మినహా మిగతా 32 జిల్లాల్లో జాతీయ జెండాను మంత్రులు, ప్రముఖులు ఎగుర వేయనున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

**ఆదిలాబాద్:** షబ్బీర్ ఆలీ, ప్రభుత్వ సలహాదారు

**భద్రాద్రి కొత్తగూడెం:** తుమ్మల నాగేశ్వర్ రావు, వ్యవసాయ శాఖ మంత్రి

**హన్మకొండ:** కొండా సురేఖ, అటవీ శాఖ మంత్రి

**జగిత్యాల :** అడ్లూరి లక్ష్మణ్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి

**జయశంకర్ భూపాలపల్లి:** బెల్లయ్య నాయక్, ఎస్టీ సహకార ఆర్థిక సంస్థ చైర్మెన్

**జనగామ:** బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్

**జోగులాంబ గద్వాల:** ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, సలహాదారు

**కామారెడ్డి:** ఎం. కోదండరెడ్డి, వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మెన్

**కరీంనగర్:** దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఐటీ శాఖ మంత్రి

**ఖమ్మం:** మల్లు భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

**కొమురం భీం ఆసిఫాబాద్:** బండా ప్రకాష్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్

మిగితా 2వ పేజీలో

## నాగార్జునసాగర్‌కు భారీగా వరద



- 2,68,876 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- శ్రీశైలానికి 1,89,651 క్యూసెక్కుల వరద
- జూరాలకు 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరద వస్తున్నది. బుధవారం జూరాలకు 90 వేల క్యూసెక్కుల వరద రాగా 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. జూరాల ద్వారా మొత్తం అవుట్‌ఫ్లో 91,340 క్యూసెక్కులుగా నమోదైంది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.991 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 అడుగులు కాగా, ప్రస్తుతం 317.680 అడుగుల నీటిమట్టం ఉన్నది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 19,570 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 19,570 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు 1,89,651 క్యూసెక్కుల వరద రాగా ఏడు గేట్లు పది ఫీట్ల మేర శ్రీశైలం జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 215.8070 టీఎంసీలకు గాను 202 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో డ్యాం 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి క్రస్ట్ గేట్లు, జలవిద్యుత్తు కేంద్రాలు, కాలువల ద్వారా 2,96,246 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. సాగర్ డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 590 (312.0450 టీఎంసీలు) అడుగులకు గాను 588.80 (308.4658 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది. ఎడమ, వరద కాలువకు నీటి విడుదలను నిలుపుదల చేయగా, కుడి కాలువకు నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు తగ్గించారు. మూసీ ప్రాజెక్టుకు వరద వస్తుండగా 5 గేట్ల ద్వారా 6,328.50 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నది. కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదలను నిలిపి వేశారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు బుధవారం 4,336 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 11వ క్రస్ట్ గేటు 1.5 మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 22.284 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌కు 1,11,685 క్యూసెకుల ప్రవాహం రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# బిహార్ ఓటర్ల జాబితా సవరణ

## ఓటర్లకు అనుకూలమని సుప్రీంకోర్టు వ్యాఖ్య

**బలగం టీవీ, హైదరాబాద్**

బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే ఇప్పుడు 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకుంటున్నారని గుర్తు చేసింది. గత రివిజన్‌లో ఏడు పత్రాలను మాత్రమే అనుమతించగా, ప్రత్యేక సవరణ లో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతిస్తోందని కోర్టు తెలిపింది.

అయితే, పిటిషనర్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, పత్రాల సంఖ్య పెరిగినా అందరికీ అవి అందుబాటులో లేవని వాదించారు. ఉదాహరణకు పాస్‌పోర్టు బిహార్‌లో కేవలం 1%–%2% మంది వద్ద మాత్రమే ఉందని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం, 36 లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయనీ, ఇది గణనీయమైన సంఖ్యగానే భావిస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందించబడుతుందని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ వివరించారు. పౌరులను చేర్చడం లేదా తొలగించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని, ఆధార్, ఓటర్ కార్డు పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదన సమర్థనీయమని కోర్టు పేర్కొంది. పార్లమెంట్ లోపల, వెలుపల %వాక్సిక్ష్మ% అంశంపై వివాదం పెరుగుతున్నప్పటికీ, ఈసీ చేపట్టిన చర్యలపై విశ్వాసం కోల్పోవడమే అసలు సమస్య అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

## 'ఓట్ల చోరీ'పై వీడియోతో రాహుల్ గాంధీ ప్రచారం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. నకిలీ ఓట్లు ఎలా వేస్తున్నారో వెల్లడించే కొత్త వీడియోను బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విడుదల చేశారు. నిమిషం నిడివి కలిగిన ఈ వీడియోను విడుదల చేస్తూ.. మీ ఓట్లను దోచుకుంటున్నారు, మీ హక్కులను దోచుకుంటున్నారు, మీ ఉనికిని దోచుకుంటున్నారని పేర్కొన్నారు. బూత్ పర్ ఓట్ చోరీ అనే ట్యాగ్‌ను వీడియోకు జత చేశారు. ఇద్దరు వ్యక్తులు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశిస్తుండగా.. మరో ఇద్దరు వ్యక్తులు వారిని ఆపి మీ ఓట్లు వేశామని చెబుతారు. అనంతరం అక్కడి ఎన్నికల అధికారికి దొంగ ఓటు వేసినట్టు చూపడం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఈ వీడియోపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు."మీ ఓటు హక్కును లాక్కోనివ్వకండి. ప్రశ్నలు అడగండి. సమాధానాలు డిమాండ్ చేయండి. ఓటు చోరీకి వ్యతిరేకంగా మీ గొంతుకను పెంచండి. రాజ్యాంగ సంస్థలను బీజేపీ కబంధ హస్తాల నుంచి విడిపించండి" అని ఎక్స్‌లో ప్రజలను కోరారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ సైతం ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా మీ స్వరాన్ని వినిపించాలని ప్రజలను కోరారు.

## గోల్కొండ కోటలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

**మహబూబాబాద్ :** జె.రామంచర్ నాయక్, అసెంబ్లీ విప్
**మహబూబ్ నగర్:** జూపల్లి కష్ణారావు, ఎక్సైజ్ శాఖ మంత్రి
**మంచిర్యాల:** హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ సలహాదారు
**మెదక్:** జి. వివేక్ వెంకటస్వామి, కార్మిక శాఖ మంత్రి
**మేడ్చల్:** కె. కేశవరావు, ప్రభుత్వ సలహాదారు
**ములుగు:** ధనసరి అనసూయ సీతక్క, పంచాయత్ రాజ్ శాఖ మంత్రి
**నాగర్ కర్నూల్:** జి. చిన్నారెడ్డి, ప్రణాళికా సంఘం వైఎస్ ఛైర్మెన్
**నల్లగొండ:** కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆర్ అండ్ బీ మంత్రి
**నారాయణపేట:** వాకిటి శ్రీహరి, పశు సంవర్ధక శాఖ మంత్రి
**నిర్మల్:** సిరిసిల్ల రాజయ్య, తెలంగాణా ఆర్థిక సంఘం ఛైర్మెన్
**నిజామాబాద్:** నిరంజన్, బీసీ కమిషన్ ఛైర్మెన్
**పెద్దపల్లి:** ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మెన్
**రాజన్న సిరిసిల్ల:** ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్
**రంగారెడ్డి:** వేం నరేందర్ రెడ్డి, సీఎం సలహాదారు
**సంగారెడ్డి:** దామోదర రాజనరసింహ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి
**సిద్దిపేట:** పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ మంత్రి
**సూర్యాపేట:** ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి
**వికారాబాద్:** గడ్డం ప్రసాద్ కుమార్, అసెంబ్లీ స్పీకర్
**వనపర్తి:** పట్నం మహేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్
**వరంగల్:** పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి
**యాదాద్రి భువనగిరి:** గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి ఛైర్మెన్

## శ్రీవారి భక్తులపై సైబర్ మోసాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. దర్శనం టికెట్లు, వసతి సౌకర్యాలు కల్పిస్తామని ఆన్‌లైన్‌లో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి డబ్బులు దోచుకుంటున్న నేపథ్యంలో తిరుమల పోలీసులు అప్రమత్తం అయ్యారు. భక్తులు జాగ్రత్తగా ఉండాలని, కేటుగాళ్ల వలలో చిక్కుకోకూడదని హెచ్చరికలు జారీ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీవారి సేవల పేరుతో నడుస్తున్న 30కి పైగా నకిలీ వెబ్‌సైట్లను గుర్తించారు. వాటిలో 28 సైట్లను ఇప్పటివరకు శాశ్వతంగా తొలగించినట్లు పోలీసులు తెలిపారు. సప్తగిరి గెస్ట్‌హౌస్, నందకం గెస్ట్‌హౌస్, పద్మావతి గెస్ట్‌హౌస్ పేర్లతో భక్తులను మోసగిస్తున్నట్లు గుర్తించినట్లు వివరించారు. భక్తులు కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://www.tirumala.org ద్వారానే దర్శనం, వసతి సేవలను బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అపరిచితుల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్, క్యూఆర్ కోడ్ చెల్లింపుల అభ్యర్థనలకు స్పందించవద్దని సూచించారు.ఏదైనా అనుమానం కలిగినా లేదా మోసపూరిత ప్రయత్నం ఎదురైనా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ, 100 నంబర్‌కు గానీ, లేదా టీటీడీ టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 4141 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# యూరియా కొరతపై హరీశ్ రావు ఫైర్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ వ్యాప్తంగా యూరియా సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవపూర్ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా యూరియా కోసం క్యూలో నిలబడి ఉన్న రైతులతో మాట్లాడారు.

హరీశ్ రావు మాట్లాడుతూ "రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేసే పరిస్థితి బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే వచ్చింది. చేతగాని ఈ రెండు సర్కార్ల నిర్లక్ష్యంతోనే రైతులకు యూరియా అందడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా ఈ సమస్యపై నోరు మెదపడం లేదు" అని మండిపడ్డారు. 8 మంది బిజెపి ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి ఎరువుల కొరత నివారణలో విఫలమయ్యారని హరీశ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీకి వెళ్లినా యూరియా సమస్యను పరిష్కరించలేదని ప్రశ్నించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బిజెపి, కాంగ్రెస్‌లకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కేసీఆర్ హయాంలో ఉచితంగా ఎరువులు, సాగునీరు ఇచ్చి రైతులను సంతోషంగా ఉంచారని, అయితే కాంగ్రెస్ పాలనలో పాతకాలం నాటి సమస్యలు మళ్లీ రావడం దురదృష్టకరమన్నారు. నానో యూరియాతో ఎకరానికి 500 రూపాయల అదనపు భారం పడుతుందని, ప్రభుత్వం సబ్సిడీ తప్పించుకోవడానికే కృత్రిమ ఎరువులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. బీహార్‌లో ఎన్నికలు ఉన్నందుకు అక్కడికి ఎరువులను తరలించడం సరికాదని హరీశ్ అభిప్రాయపడ్డారు. ఉదయం నుంచి గంటల తరబడి క్యూలో నిలబడిన రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా బస్తాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మారెడ్డి రవీందర్ రెడ్డి, ప్రభాకర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

### రిజర్వాయర్లను వెంటనే నింపాలని హరీశ్‌రావు డిమాండ్

ప్రస్తుత వానాకాలం పంట సీజన్‌లో రైతులు ఇటు వర్షాభావం, అటు రిజర్వాయర్లలో నీరు లేక పంటల సాగు ముందుకు పోక తీవ్ర ఆందోళనలో ఉన్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–6 వద్ద నంది పంప్‌హౌస్ మోటార్లను తక్షణమే ఆన్ చేసి మిడ్ మానేరూ, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ తదితర రిజర్వాయర్లను నింపాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల గోదావరిలో ఇన్‌ఫ్లో పెరిగిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని నీటిని చెరువులు, చెక్‌డ్యామ్‌లు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# వానలే వానలు.. రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రవహిస్తున్నాయి. ఎగువ ఉన్న మహబూబాబాద్, భద్రాద్రి, వరంగల్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు వచ్చి మున్నేరులో చేరుతుండటంతో వరద పోటెత్తింది. నల్లగొండ జిల్లా ఆడవిదేవులపల్లి రహదారిపై లావుడితండ–రామన్నపేట ల మధ్య ఉన్న లోలెవెల్ వంతెన పై భారీగా వరద ఉధృతి కొనసాగింది. దాంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొండమల్లేపల్లి మండంలో కురిసిన భారీ వర్షాలకు గౌరుకుంటా తండా గ్రామం వరద నీటిలో చిక్కుకుంది.

### గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

గ్రేటర్ హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో కుండపోత వానలతో నగరంలోని పలు ప్రాంతాలల్లో రోడ్లు జలమయమై, ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పోలీస్, వాటర్‌బోర్డు అధికారులు అప్రమత్తమయ్యారు. హైటెక్ సిటీలోని ఐకియా కూడలి వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలతో నగరవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు చర్యలు చేపట్టారు. వర్షాల నేపథ్యంలో ఐటీ ఉద్యోగులు, ఇతర సిబ్బంది చాలా వరకు బుధవారం ఇంటి నుంచే పనిచేశారు.

### వరదలో కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడిన హైడ్రా

పాతబస్తీలోని యాకుత్‌పురా రైల్వే స్టేషన్ దగ్గరలోని వరద కాలువలో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని హైడ్రా సిబ్బంది కాపాడారు. మేకల మేతకోసం చెట్టు కొమ్మలను తీసుకువచ్చేందుకు స్థానికంగా నివాసముండే గౌస్ బుధవారం కాలువ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. ప్రమాదవశాత్తు వరద కాలువలోకి జారుకున్నాడు. గమనించిన స్థానికులు 100 మీటర్ల దూరంలో కచ్చామోరీల్లో చెత్తను తొలగించే పనిలో ఉన్న హైడ్రా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్ హుటాహుటిన సిబ్బందితో అక్కడకు చేరుకుని గౌస్‌ను కాపాడారు. కాలువలోకి దిగడానికి ఏమాత్రం అవకాశం లేని ప్రమాదకర పరిస్థితుల్లో నిచ్చెన కిందకు వేసి దాని ద్వారా యువకుడిని కాపాడారు. రెయిన్ బజార్ కార్పొరేటర్ వసీతో పాటు హైడ్రా సిబ్బంది వంశీ, బాలరాజు తదితరులు యువకుడిని కాపాడినవారిలో ఉన్నారు.

### ప్రాజెక్టుల్లోకి వరద నీరు, గేట్లు ఎత్తి విడుదల

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ఏడు గేట్ల ఎత్తి అధికారులు నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి భారీ వరద వస్తోంది. నాగార్జునసాగర్ జలాశయం కూడా నిండుకుండలా మారింది. ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. అదేవిధంగా మూసీ ప్రాజెక్టు గేట్ల ద్వారా కూడా నీటి విడుదల కొనసాగుతోంది. మూసీ ప్రాజెక్టు 5 గేట్లు 2అడుగుల మేర ఎత్తి 6387.01 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. నిర్మల్ జిల్లా కడెం మండలం కడెం ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఇరిగేషన్ అధికారులు ఎత్తారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 19,926 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోనికి రాగా, మూడు గేట్లు ఎత్తి ప్రాజెక్టు నుంచి 18,322 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్టు ఈఈ విఠల్ పేర్కొన్నారు. కుమురం భీం ప్రాజెక్టు నుండి బుధవారం ఐదు గేట్ల ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు.

## త్వరలో తెలంగాణలో టూరిస్ట్ పోలీస్ వ్యవస్థ

### డీజీపీ జితేందర్ వెల్లడన

**బలగం టీవీ, హైదరాబాద్**



రాష్ట్ర పర్యాటక ప్రాంతాలలో భద్రతను బలోపేతం చేయడానికి త్వరలో టూరిస్ట్ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ జితేందర్ ప్రకటించారు. బుధవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, అడిషనల్ డీజీపీ (శాంతి భద్రతలు) మహేశ్ ఎం. భగవత్, టూరిజం శాఖ ఎండీ వల్లూరు క్రాంతి, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సీహెచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ మాట్లాడుతూ తొలి దశలో 80 మంది పోలీసు సిబ్బందిని టూరిజం శాఖకు కేటాయిస్తామని, సెప్టెంబర్ 27న జరగనున్న వరల్డ్ టూరిజం డే నాటికి ఈ వ్యవస్థను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్, బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ వంటి ప్రదేశాలలో టూరిస్ట్ పోలీసులు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. పర్యాటక, సినీ చిత్రీకరణ, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించాలని సూచించారు. సినీ నిర్మాతలు ముందస్తుగా సమాచారమిస్తే భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా చేయవచ్చని చెప్పారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, మెడికల్, వినోద పర్యాటక ప్రాంతాలను సందర్శించేవారి భద్రత కోసం టూరిస్ట్ పోలీస్ అవసరం ఉందని, రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనుగుణంగా ఈ చర్యలు చేపడతామని తెలిపారు.

# డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం..

- భావితరాలకు మంచి భవిష్యత్తుని అందిద్దాం..
- జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటుగా విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మాదకద్రవ్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నాషా ముక్త్ భారత్ అభియాన్ ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లాలో విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీస్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో కలసి పాల్గొన్న జిల్లా ఎస్పీ.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ "నేను మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఎవ్వరూ డ్రగ్స్ భారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందిస్తానని, డ్రగ్స్ రహిత సమాజాన్ని లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేపించడం జరిగిందన్నారు.డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాదకద్రవ్యాల వలన కలుగు అనర్ధాలపై అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో మాదకద్రవ్యాలు సమూలంగా నిర్మూలించటలో యువత, ప్రజలు పోలీసువారికి సహకరించుటలో కీలక పాత్ర పోషించాలని కోరారు.

జిల్లాలో అక్రమంగా గంజాయి సేవించిన, క్రయవిక్రయాలు జరిపిన, కఠిన చర్యలు తప్పవని ఈసందర్భంగా హెచ్చరించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపారు.

జిల్లాలో ఈ సంవత్సరం 40 కేసులల్లో 98 మందిని అరెస్ట్ చేసిన 3.700 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మ, సి.ఐ లు నటేష్, రవి, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు శ్రీకాంత్, ప్రేమానందం, జునైద్, శ్రవణ్, శ్రీనివాస్, రమేష్, పోలీస్ సిబ్బంది కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## పండుగలా ఇందిరమ్మ ఇళ్ల కడప పూజ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- లబ్దిదారులకు చీర సారె అందజేసిన విప్

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలో ని సుభాష్ నగర్ లో పలువురి లబ్దిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం భాగంగా బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల కడప పూజా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం లబ్దిదారులకు తోబుట్టు వలె చీర సారె ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు అందజేశారు.. గత కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న స్వంత ఇంటి కల నెరవేరిందని ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కి లబ్దిదారులు ధన్యవాదాలు తెలిపారు..




## బాధిత కుటుంబానికి పరామర్శ..

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ నియోజక వర్గంలోని మూడపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కట్కూరి ఏలీయా తండ్రి కట్కూరి దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం వారి కుటుంబాన్నీ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి.వారి వెంట సంటి బాపూరావు, మాజీ సర్పంచ్ చిలుక అంజిబాబు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, బైరగోని రమేష్ గౌడ్, బోడిగే అనిల్, బద్దం బాపురెడ్డి, వట్టిమళ్ళ లస్మయ్య, సిరిగిరి సుధాకర్, ఏఎంసి డైరెక్టర్ సిరికొండ మల్లయ్య, ప్యాక్స్ డైరెక్టర్ రవి, బొడిగే అనిల్, చింతకుంట భూమయ్య, పరుశురాం ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో కేటీఆర్ పర్యటన



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు బుధవారం కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యంగా పార్టీ కార్యకర్తల పిల్లల వివాహాలకు హాజరై కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా ముచ్చటించారు. ముందుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్గునూర్‌లో గల ఉన్నతి ఫంక్షన్ హాల్లో న్యాయవాది ఆవునూరి రమాకాంత్‌రావు కుమార్తె నాగప్రణవి, అభిరాం వివాహానికి హాజరైన కేటీఆర్ వారిని ఆశీర్వదించారు. అనంతరం వీ కన్వెన్షన్, మల్యాపూర్ రోడ్డులోని పీవీఆర్ గార్డెన్‌లో జరిగిన వివాహాలకు హాజరై వధూవరులను దీవించారు. తర్వాత వేములవాడ, సిరిసిల్లలో జరిగిన వేడుకల్లోనూ పాల్గొన్న కేటీఆర్ వద్ద అభిమానులు, మహిళలు సెల్ఫీలు దిగగా, యువకులు 'జై కేటీఆర్' అంటూ నినాదాలు చేశారు.



**డా. వాసరవేణి పర్శరాములుకు సిలుముల రాజనర్సు స్మారక సాహితీ పురస్కారం 2025..**

బాలసాహిత్యంలో ఆవిరళ కృషి చేసిన రచయిత, పరిశోధకులు డా.వాసరవేణి పర్శరాములు కు "సిలుముల రాజనర్సు" విశ్రాంత ప్రధానోపాధ్యాయులు స్మారక సాహితీ పురస్కారం సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు చేతుల మీదుగా ఆగష్టు 13న సిరిసిల్లలో సాయంత్రం అందజేశారు. పురస్కార కమిటీ అధ్యక్షుడు సిలుముల జయవర్ధన్ మాట్లాడుతూ.. వాసరవేణి పరశురాం బాల్యం నుంచే వ్యవసాయ కూలీగా, సిరిసిల్లలో నేతకార్మికునిగా పని చేశారని, తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర పోషించారని, ప్రస్తుతం అధ్యాపకునిగా బోధన చేస్తున్నారనీ, సామాజిక, సాహితీ రంగంలో కృషి చేస్తున్నారనీ నాన్న రాజనర్సు పేరు మీద ఎమ్మెల్యే కేటీఆర్ చేతుల మీదుగా అందించడం సంతోషంగా ఉందని అన్నారు. సాహితీ కమిటీ అధ్యక్షుడు జయవర్ధన్, కోకన్వీనర్ డా. జనపాల శంకరయ్య, కుటుంబ సభ్యులు పల్లె రేణుక, ఎల్లయ్య బీఆర్?ఎస్? ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నెక్లెస్ రోడ్డులో తిరంగా ర్యాలీ

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని మరింత పెంచేందుకు బిజెపి చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా) కార్యక్రమంలో భాగంగా గురువారం (14న) నెక్లెస్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మూడు రోజులుగా దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని మనోహర్ రెడ్డి బుధవారం విలేఖరుల సమావేశంలో చెప్పారు. ఇదిలాఉండగా గురువారం ఉదయం 10.30 గంటలకు నెక్లెస్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే తిరంగా ర్యాలీలో పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఇతర ముఖ్య నాయకులూ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 4-0 లక్షల ఇండ్లపై త్రివర్ణ పతాకాలు ఎగుర వేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలూ ఇందులో పాల్గొనాలని ఆయన కోరారు. ఇప్పటికే రెండు రోజులుగా తిరంగా ర్యాలీలు జరుగుతున్నాయని ఇందులో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ప్రజలంతా ఐక్యంగా నిలబడి దేశ భక్తిని చాటాలని మనోహర్ రెడ్డి కోరారు. ప్రధాని నరేంద్ర మోడి పిలుపుతో ప్రజల మధ్య జాతీయ ఐక్యతను చాటే ఘనత దక్కిందన్నారు.

## ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు..

**ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తిపాటి మంజుల**

**బలగం టీవీ, ఆలేరు**



2025 ఆగస్టు 15న మన భారతదేశం 78 స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటన్న సందర్భంగా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తిపాటి మంజుల మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర పోరాటం, అలుపెరగని పోరాటం, ఎందరో త్యాగాలకు ప్రతీక. అహింస సిద్దాంతాన్ని ఏకతాటిపై నడిపించిన గాంధీ, కోట్లాది మంది భారతీయుల్లో స్పూర్తిని నింపారు.సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు వంటి ఎందరో యోధులు వారి ప్రాణాలు పణంగా పెట్టి,స్వాతంత్రాన్ని సాధించారు. ఇంకా ఎంతో మంది మహానుభావులు తమ జీవితాలను ధారపోశారని, వారు ఎలాంటి స్వార్ధము లేకుండా దేశ ప్రగతి కోసం, దేశ సంక్షేమం కోసం ముందడుగు వేశారని, మన దేశ స్వాతంత్రం కోసం పాటుపడిన, ప్రాణాలు అర్పించిన త్యాగధనులకు నివాళి అర్పించడం మన అందరి కనీస బాధ్యతని,దేశ పురోగతికి దోహదపడే పర్యావరణ పరిరక్షణ, చట్టాన్ని గౌరవించడం, తోటి వారికి సహాయపడటం దేశం కోసం మంచి పనులు చేస్తామని, ప్రతిజ్ఞ చేద్దాం అని, మన దేశం మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుందాం అని అన్నారు. అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## తిమ్మాపూర్‌లో కేటీఆర్‌తో దేవేందర్ రెడ్డి భేటీ

**బలగం టీవీ, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కే. తారకరామారావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్‌లో పార్టీ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ స్థాయిలో ఎండగట్టాలని సూచించారు.

## ప్రాథమిక స్థాయిలోనే అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి : డీఈవో మాధవి

**బలగం టీవీ, పెద్దపల్లి**




ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే అభ్యాసన సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని జిల్లా విద్యా అధికారి (డీఈవో) మాధవి సూచించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్-టీఎల్ఎం మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తడబడకుండా చదవడం, రాయడంలో పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమీక్ అధికారి పీఎం షేక్, హెచ్ఎంలు హనుమంతు, పురుషోత్తం, ఆగయ్య, మనోహర్, కృష్ణారెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

# బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ విచారణకు సురేశ్ రైనా

**బలగం టీవీ, హైదరాబాద్**



అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో టీమిండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా బుధవారం ఢిల్లీ ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఉదయం ఈడీ ఆఫీస్‌కి వచ్చిన రైనాను అధికారులు పీఎంఎల్‌ఏ కింద ప్రశ్నించారు. 1xBet యాప్‌కు సంబంధించి అక్రమ బెట్టింగ్ కేసులో విచారణకు రావాలంటూ ఈడీ రైనాకు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీసుల మేరకు ఆయన విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఈడీ ఇప్పటికే అనేక మంది పెట్టుబడిదారులు, సంబంధిత వ్యక్తులను ప్రశ్నిస్తోంది. బెట్టింగ్ యాప్‌లు కోట్ల రూపాయల మోసం చేయడమే కాకుండా భారీగా పన్నులు ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సురేశ్ రైనా టీమిండియా తరఫున 322 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి, దాదాపు 8 వేల పరుగులు చేశారు. మూడు ఫార్మాట్లలో సెంచరీ చేసిన తొలి భారతీయ క్రికెటర్‌గా రైనా రికార్డు సృష్టించారు. ఐపీఎల్‌లో సీఎస్‌కే తరఫున 205 మ్యాచ్‌ల్లో 5,528 పరుగులు చేసి, జట్టును నాలుగు సార్లు చాంపియన్‌గా నిలిపేలా కీలకపాత్ర పోషించారు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మకు రెండో స్థానం

**బలగం టీవీ, హైదరాబాద్**



టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించినా, వన్డే కెరీర్ అనిశ్చితిలో ఉన్నా 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ తన ప్రభావాన్ని ఐసీసీ ర్యాంకింగ్స్‌లో చూపించాడు. తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రోహిత్ రెండో స్థానానికి ఎగబాకాడు. చాంపియన్స్ ట్రోఫీ అనంతరం వన్డేలు ఆడనప్పటికీ, వెస్టిండీస్‌తో సిరీస్‌లో పాకిస్తాన్ స్టార్ బాబర్ ఆజమ్ విఫలమవడం రోహిత్‌కు లాభమైంది. బాబర్ 736 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానానికి జారిపోగా, రోహిత్ 756 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. శుభ్‌మన్ గిల్ 768 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు.



# ఓటీటీలో దూసుకెళ్తున్న జారన్

**బలగం టీవీ, హైదరాబాద్**

హారర్ థ్రిల్లర్ అంటే సాధారణంగా దెయ్యం కథలే గుర్తుకు వస్తాయి. అయితే ప్రేక్షకులను దెయ్యం సినిమాల కంటే ఎక్కువగా భయపెట్టే అంశం 'చేతబడి'. దెయ్యాల సినిమాలను నలుగురితో కలిసి చూసే ధైర్యం చేసే వారు, చేతబడి కథలవైపు మాత్రం సాహసించరు. ఆ తంతు అంత భయానకంగా ఉంటుంది కాబట్టి! ఈ నేపథ్యంలో తెరకెక్కిన మరాఠీ సినిమా 'జారన్' (అర్థం: చేతబడి) ఇప్పటికే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అమోల్ భగత్, నితిన్ బాలచంద్ర కులకర్ణి నిర్మాణంలో, రిషికేశ్ గుప్తా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం, జూన్ 6న థియేటర్లలో విడుదలై, ఆగస్టు 8 నుంచి 'జీ5'లో స్ట్రీమింగ్ అవుతోంది. విడుదలైన వెంటనే ఈ కంటెంట్ ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. అమృత సుభాష్, అనిత కేల్కర్, కిశోర్, అవని జోషి, సీమా దేశ్‌ముఖ్, సోనాలి కులకర్ణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, భయపడుతూనే ఆసక్తిగా చూడాల్సిన కంటెంట్‌గా నిలుస్తోంది. పాతకాలపు ఆచార సంప్రదాయాల నడుమ భర్త, కూతురుతో నివసించే రాధ అనే మహిళపై జరిగే చేతబడి కథే ఈ చిత్రానికి ప్రాణం. రాధపై చేతబడి ఎవరు చేశారు? ఎందుకు చేశారు? ఆ క్షుద్ర శక్తి బారి నుంచి ఆమె బయటపడుతుందా? అనేదే కథ.

# పవన్ పుట్టినరోజు కానుకగా 'జల్సా' రీ-రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు (సెప్టెంబర్ 2) సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుకగా 'జల్సా' సినిమాను మళ్లీ రీ-రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ విషయాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది. గతంలో 2022లో కూడా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను 4కే వెర్షన్‌లో రీ-రిలీజ్ చేయగా, రూ.3 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రీ-రిలీజ్ చిత్రాల కేటగిరీలో కొత్త రికార్డులు సృష్టించింది. పవన్ అభిమానుల్లో ఇప్పటికీ ఈ సినిమాకు ఉన్న క్రేజ్ కారణంగా, మళ్లీ పెద్ద ఎత్తున థియేటర్లలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 2న 'జల్సా' మళ్లీ వెండితెరపై సందడి చేయనుంది.




# 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య రేసులో భారత్

## ఐవోఏ ఎస్‌జీఎమ్‌లో బిడ్డింగ్‌కు ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్**




ప్రతిష్టాత్మక 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య రేసులో భారత్ బలంగా అడుగులు వేస్తోంది. పోటీలో ఉన్న కెనడా తప్పుకోవడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు భారత ఒలింపిక్ సమాఖ్య (ఐవోఏ) ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎమ్)లో బిడ్డింగ్‌కు ఆమోదం తెలిపింది. దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**ఆతిథ్య నగర రేసులో మూడు నగరాలు**

2010లో కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించిన అనుభవం ఉన్న భారత్, ఈసారి అహ్మదాబాద్‌ను ప్రధాన ఆతిథ్య నగరంగా ప్రతిపాదించింది. అయితే భువనేశ్వర్, ఢిల్లీ కూడా పోటీలో ఉన్నాయి. ఈనెల 31లోగా భారత్ తుది బిడ్ సమర్పించాల్సి ఉంది.

"ఆతిథ్యంపై ఎస్‌జీఎమ్‌లో ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. అహ్మదాబాద్‌తో పాటు భువనేశ్వర్, ఢిల్లీల్లోనూ మెరుగైన వసతులు ఉన్నాయి. వేదిక త్వరలో ఖరారవుతుంది" అని పీటీ ఉష తెలిపారు.

ఐవోఏ సీఈవో రఘురామ్ అయ్యర్ మాట్లాడుతూ, "కెనడా తప్పుకోవడం భారత్ అవకాశాలను మెరుగుపరిచింది. ఎన్ని దేశాలు పోటీలో ఉన్నాయో ఇంకా స్పష్టత రావాలి" అన్నారు.

ఆర్థిక కారణాల వల్ల 2026 గ్లాస్గో గేమ్స్ నుంచి కొన్ని ఈవెంట్లు తప్పించగా, భారత్ మాత్రం అన్ని మెడల్ ఈవెంట్స్ నిర్వహించేందుకు సిద్ధమని తెలిపింది. షుటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, యోగా వంటి సంప్రదాయ క్రీడలను కూడా చేర్చే ప్రణాళికలు ఉన్నాయి.

**అహ్మదాబాద్ వసతుల పరిశీలన**

కామన్వెల్త్ స్పోర్ట్ ప్రతినిధులు ఇటీవల అహ్మదాబాద్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. మొత్తం పరిశీలనలో మెరుగైన అభిప్రాయం వ్యక్తమైందని ఐవోఏ సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే తెలిపారు.

**తదుపరి కీలక తేదీలు**

ఈనెలాఖరులో లేదా సెప్టెంబర్‌లో కామన్వెల్త్ స్పోర్ట్ బృందం మరోసారి అహ్మదాబాద్ పర్యటన

నవంబర్ చివర్లో గ్లాస్గోలో కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీలో 2030 ఆతిథ్య దేశం ఖరారు

# సినీ కార్మికుల వేతన వివాదం.. చర్చలు విఫలం

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన 24 కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం చేపట్టిన షూటింగ్‌ల బంద్ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ విషయంపై ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో భేటీ అయ్యారు. షుటింగ్‌లను నిలిపివేయడం సరికాదని, పనిచేస్తూనే డిమాండ్లు నెరవేర్చుకోవాలని మంత్రి సూచించారు. తాజాగా నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. సినీ కార్మికుల వేతనాల అంశం ఇంకా కొలిక్కి రాలేదని, మరో రెండు – మూడు సార్లు చర్చలు జరిపితే పరిష్కారం వచ్చే అవకాశముందని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. చర్చల మధ్యలోనే కొందరు నిర్మాతలు వెళ్లిపోవడంతో, సమ్మె కొనసాగినా పర్వాలేదన్న ధోరణి వ్యక్తమైందని సమాచారం. నాలుగు వర్కింగ్ కండిషన్లపై ఏకాభిప్రాయంతో చర్చలకు రావాలని నిర్మాతలు సూచించినట్టు తెలుస్తోంది. బంద్ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దిల్ రాజు భేటీ అయ్యారు. అంతకుముందు కార్మికులు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కమిషనర్ ఆఫీసుకు వెళ్లి తమ డిమాండ్లు తెలియజేశారు.

# బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ విచారణకు మంచు లక్ష్మి హాజరు

**బలగం టీవీ, హైదరాబాద్**



అక్రమ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో నటి, నిర్మాత మంచు లక్ష్మీ ప్రసన్న బుధవారం ఉదయం సుమారు 10.30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు.

బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి గాను కుదుర్చుకున్న ఒప్పందాలు, అందుకున్న పారితోషికం, ఇతర ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు ఆమెను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ సందర్భంగా మంచు లక్ష్మి వాంగ్మూలాన్ని నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ప్రముఖ నటులు ప్రకాశ్‌రాజ్ (జూలై 30), విజయ్ దేవరకొండ (ఆగస్టు 6), రానా దగ్గుబాటి (ఆగస్టు 11) విచారణకు హాజరై 4 – 5 గంటలపాటు ఈడీ అధికారుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నమోదైన ఐదు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ – 1867 ఉల్లంఘనతో పాటు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద 29 మంది నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. గత విచారణల్లో రానా, విజయ్ దేవరకొండలు చట్టబద్ధమైన స్కిల్-బేస్డ్ గేమ్స్‌కే ప్రచారం చేశామని స్పష్టంచేయగా, ప్రకాశ్‌రాజ్ తాను గేమింగ్ యాప్‌కి ప్రచారం చేసినప్పటికీ ఎలాంటి పారితోషికం తీసుకోలేదని ఈడీకి తెలిపారు. ఈ కేసులో మరికొంత మంది సెలబ్రిటీలను కూడా విచారించే అవకాశముందని తెలుస్తోంది.

# 'జిగ్రీస్' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటుడు రామ్ నితిన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రీస్'. ఫ్రెండ్‌షిప్, అడ్వెంచర్, కామెడీ ప్రధానాంశాలుగా రూపొందిన ఈ చిత్రంలో కృష్ణ బురుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఆవిష్కరించారు. 'కొంత మంది ఉంటారు సుద్దపూసలు, ఫస్ట్ వద్దే వద్దు అంటూ షో చేస్తరు.. తర్వాత కూర్చున్నాక నాకంటే ఎక్కువ తాగుతరు' అనే డైలాగ్‌తో టీజర్ మొదలై, నలుగురు స్నేహితుల జీవితాల్లో చోటుచేసుకునే సరదా సంఘటనలతో కొనసాగుతుంది. హరీష్ రెడ్డి ఉప్పల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కృష్ణ వోడపల్లి నిర్మించారు. నవ్వులు పూయించే ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఓటీటీలోకి 'సూపర్‌మ్యాన్'

**బలగం టీవీ, హైదరాబాద్**



సూపర్ హీరో సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేక క్రేజ్ ఉంటుంది. ముఖ్యంగా చిన్నారులు వీటిని ఎంతో ఇష్టంగా చూస్తారు. అందులోనూ డిసి యూనివర్స్‌లోని సూపర్‌మ్యాన్ సిరీస్ చిత్రాలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. 1948లో మొదలైన ఈ సిరీస్ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. తాజాగా ఈ సిరీస్‌లో వచ్చిన సూపర్‌మ్యాన్ చిత్రం జూలై 11న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. అయితే ఊహించిన స్థాయిలో కలెక్షన్లు రాబట్టలేకపోయింది. అయినప్పటికీ, విడుదలైన నెల రోజుల్లోనే ఈ చిత్రం ఓటీటీలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది.సినిమా దర్శకుడు జేమ్స్ గన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. "ఈ శుక్రవారం సూపర్‌మ్యాన్ మీ ఇళ్లకు వస్తున్నాడు. ఈలోపు థియేటర్లలో అందుబాటులో ఉంటే తప్పక చూసేయండి" అని తెలిపారు. ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్, యాపిల్ టీవీ, ఫాండంగో వంటి ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో స్ట్రీమింగ్ కానుంది.